క్లుప్తంగా

విద్యాసామగ్రి పంపిణీ


చిన్నారులతో సంగీత-సుభాష్ దంపతులు

బాసర: మండలకేంద్రానికి చెందిన బీజేపీ పట్టణాధ్యక్షుడు జిడ్డు సుభాష్–సంగీత దంపతులు తమ పెళ్లిరోజును పురస్కరించుకొని.. గురువారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రూ.10వేల విలువైన పరీక్షప్యాడ్లు, నోట్‌బుక్‌లు, పెన్సిళ్లు తదితర విద్యాసామగ్రి అందించారు. త్వరలో ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకుంటానని ప్రకటించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాల హెచ్‌ఎంలు సాతాల నరసయ్య, బడకల గంగారావు, నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడెం డీటీగా లచ్చిరాం


నూతన డీటీతో తహసీల్దార్, సిబ్బంది

కడెం: కడెం డిప్యూటీ తహసీల్దార్‌గా లచ్చిరాం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీటీగా పని చేసిన శంకర్ పెంబికి బదిలీపై వెళ్లగా.. ఆయన స్థానంలో పెంబి డీటీగా పనిచేస్తున్న లచ్చిరాం కడెంకు బదిలీపై వచ్చారు. తహసీల్దార్ సుజాత, రెవెన్యూ సిబ్బంది డీటీకి స్వాగతం పలికారు.

నేడు అడెల్లి లో వేలం

సారంగపూర్: జిల్లాలోని శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద టెంట్‌హౌజ్ నిర్వహణకు శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రమేశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడాది కాలపరిమితితో వంటపాత్రలు అద్దెకు ఇచ్చేందుకు వ్యాపారులు ముందుకు రావాలని సూచించారు. ఉదయం 9 గంటల వరకు దేవాదాయ శాఖ నిర్ణయించిన దరావత్తు సొమ్మును ఆలయ అధికారుల వద్ద జమ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే

భైంసాటౌన్: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ముధోల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు జి.విఠల్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించారు. ముధోల్‌లో ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు.

కుక్కలదాడిలో మేక మృతి

బాసర: మండలకేంద్రంలో హోటల్ నిర్వహిస్తున్న సాదక్‌కు చెందిన మేకల గుంపుపై కుక్కలు దాడి చేయడంతో ఓ మేక మృతి చెందింది. సుమారు రూ.ఆరువేల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

మొరం టిప్పర్ల పట్టివేత

ముధోల్: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపం నుంచి అక్రమంగా మొరం, ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్నట్లు ముధోల్ సీఐ మల్లేశ్ తెలిపారు. గురువారం ఎలాంటి అనుమతుల్లేకుండా మొరం, ఎర్రమట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గర్భిణులకు అవగాహన కల్పించాలి

మామడ: హైరిస్క్ ప్రెగ్నెన్సీతో తల్లి, బిడ్డకు ప్రమాదం ఉంటుందని వైద్యాధికారి స్వర్ణారెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హైరిస్క్ ప్రెగ్నెన్సీ కలిగిన గర్భిణులను గుర్తించే విధానంపై ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. చిన్నవయసుతో పాటు వయసు పైబడిన వారు గర్భం దాలిస్తే ఇబ్బందులుంటాయని వివరించి వైద్యుల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. వైద్యుడు అరుణ్, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ముధోల్: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు అమృత తెలి పా రు. కె.మంజూష(ఎనిమిదో తరగతి), ఎ.సంకీర్తన (తొమ్మిదో తరగతి), ఎం.తేజశ్రీ (పదో తరగతి) నిర్మల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

సెలవు ఇవ్వాలని వినతి

లోకేశ్వరం: నిర్మల్‌లోని టీఎన్‌జీవో భవనంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మహాసభలు నిర్వహిస్తున్నందున మండలంలోని ఆశావర్కర్లకు సెలవు ఇవ్వాలని కోరుతూ లోకేశ్వరం వైద్యాధికారి తేజస్వికి వినతిపత్రం అందజేశారు. గురువారం ఆసుపత్రిలో వైద్యాధికారిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘం అధ్యక్షురాలు అయిటి ఆనంద, భోజవ్వ ఉన్నారు.

జ్యోతిబాపూలేకు నివాళి


నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నేతలు


ముధోల్‌లో జ్యోతిబాపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో గురువారం మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ మాట్లాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప సంఘసంస్కర్త జ్యోతి బాపూలే అన్నారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజగంగన్న, వాల్‌సింగ్, రాజు, నరేందర్‌రెడ్డి, ప్రదీప్, శంకర్ తదితరులు ఉన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబాపూలే అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలో బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు విద్య అవసరమని చాటి చెప్పిన మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అని.. పూలే దంపతులు దేశప్రజలకు చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఆ సంఘం జిల్లా కోకన్వీనర్ కొట్టురి కిషన్, పేరంబదూరి వెంకటరమణ పాల్గొన్నారు.

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జ్యోతిబా పూలే వర్ధంతి నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం భూమేశ్వర్, ఉపాధ్యాయులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే వర్ధంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ గౌతం జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, చిన్నయ్య, విఠల్, వినోద్‌కుమార్,నవీన్, మహేందర్, సాయినాథ్ ఉన్నారు.

పూలే అడుగుజాడల్లో నడుద్దాం

ముధోల్: జ్యోతిబాపూలే అడుగుజాడల్లో నడుద్దామని మహాత్మా జ్యోతిబాపూలే కమిటీ సభ్యులు అన్నారు. ముధోల్‌లో జ్యోతిబాపూలే విగ్రహానికి ప్రధాన కార్యదర్శి తాటివార్ రమేశ్, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ ఉప కార్యదర్శి దేవోజీ భూమేశ్, ఉపసర్పంచ్ మోహన్‌యాదవ్, నాయకులు ధమ్మపాల్, వందేమాతరం, శృంగారే సునీల్, లవణ్, సాయారెడ్డి, అమృత్ తదితరులు పాల్గొన్నారు.


కడెం : లింగాపూర్ పాఠశాలలో..


లోకేశ్వరంలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


ఖానాపూర్ : నివాళులర్పిస్తున్న జాన్సన్‌నాయక్

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తానూరు: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా తానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై విద్యార్థులకు మండలస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు. పోటీల్లో మండలంలోని ఆయా గ్రామాల ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఎల్వి పాఠశాల విద్యార్థిని బి.సంధ్యారాణి ప్రథమస్థానంలో, ద్వితీయస్థానంలో గాయత్రి(భోసి పాఠశాల), తృతీయస్థానంలో శివరాజ్ (బోరిగాం పాఠశాల) నిలిచి ఈనెల 30న నిర్వహించే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో నరేందర్ తెలిపారు. హెచ్‌ఎంలు సాయిబాబు,శిరీశ్‌కుమార్, ఉపాధ్యాయులు రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మామడ: మండలకేంద్రంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరులు అంశంపై నిర్వహించిన పోటీల్లో కొరిటికల్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని షాయిస్తభాను ప్రథమ, అరుణవతి(కేజీబీవీ మామడ) ద్వితీయస్థానంలో, గిరిచందన్ తృతీయస్థానంలో నిలిచారు. విద్యార్థులను ఎంఈఓ వెంకటరమణారెడ్డి, గైడ్ టీచర్ సత్తన్న అభినందించారు.


తానూరులో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఖానాపూర్ కేటీఎస్ పాఠశాల విద్యార్థిని సాయిశ్లోక (తొమ్మిదో తరగతి) ప్రథమస్థానంలో నిలిచింది. గురువారం పాఠశాలలో విద్యార్థినిని కేటీఎస్ ప్రిన్సిపాల్ రమేశ్, డైరెక్టర్ శ్రీనివాస్ అభినందించారు. ఈ నెల 30న నిర్మల్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం వరమని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్మల్ పట్టణం, లక్ష్మణచాంద, సోన్, మామడ, దిలావరపూర్ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు గురువారం చెక్కులు పంపిణీ చేశారు. 38 మందికి సుమారు 16.70 లక్షల విలువైన చెక్కులు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, సారంగాపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ, పట్టణ అధ్యక్షులు చిన్ను, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, లక్ష్మణచాంద, సోన్ మండలాల అధ్యక్షులు వోద్నాల రాజేశ్వర్, మధుకర్ రెడ్డి, దేవరకోట చైర్మన్ కొండ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న శ్రీహరిరావు

ప్రజలకు ‘ఉపాధి’ అండ


లోకేశ్వరంలో పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- ఇప్పటికే గ్రామసభల ద్వారా పనుల గుర్తింపు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న ఈజీఎస్ అధికారులు

లోకేశ్వరం: వలసలు నివారించి.. ఉన్న ఊరిలోనే పని కల్పించేందుకు గతంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 266 రకాల పనులు చేపట్టనుండగా.. జిల్లాలో మాత్రం 25 రకాల పనులు చేస్తున్నారు.

గతేడాది..

2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో చేపట్టిన ఉపాధి పనుల విలువ రూ.191.96 కోట్లు. ఇందులో కూలీలకు రూ.107.29 కోట్లు చెల్లించగా.. మెటీరియల్ కోసం మరో రూ.76.99 కోట్లు ఖర్చు చేశారు. గతేడాది జిల్లాలో 1.72 లక్షల జాబ్ కార్డులుండగా 1.84 లక్షల మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించారు. లేబర్ బడ్జెట్ 56.82లక్షలు కాగా ఒక్కో కుటుంబంలో ఏడాదికి సరాసరి 53 రోజుల పని కల్పించారు. జిల్లాలో 6,970 కుటుంబాలకు వంద రోజుల పని కల్పించారు. పథకం కింద రోజు కూలీ రూ.186 చెల్లించారు.

ఈసారి..

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1.76 లక్షల జాబ్‌కార్డులున్నాయి. ఇందులో పనికి వస్తున్న కూలీల సంఖ్య 1.83లక్షలు ఉండగా.. ఇప్పటి వరకు ఖర్చు చేసిన సొమ్ము 148.87 కోట్లు. ఇందులో కూలీలకు చెల్లించినవి రూ.114.43కోట్లు.

పథకం కింద చేపట్టే పనుల వివరాలు..

ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లోని చెరువుల్లో పూడిక తీయడం, చెరువుల కాల్వలకు మరమ్మతులు, పంట కాల్వల పనులు, రైతుల వ్యవసాయ భూములు చదును చేయడం, పశువుల పాకల నిర్మాణం, పంట పొలాలకు వెళ్లే మట్టి రోడ్లు నిర్మించడం, వన మహోత్సవంలో మొక్కలు నాటి సంరక్షించే పనులు చేస్తున్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకం, ఇంకుడుగుంతల నిర్మాణం, నీటినిల్వ గుంతల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు.

పనులకు వెళ్తున్నాం



అడిగిన వెంటనే అధికారులు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. చెరువులో మట్టి తవ్వే పనులు చేశాం. ఉన్న ఊరిలోనే పనులు దొరుకుతుండటంతో ఇతర గ్రామాలకు వెళ్లడం లేదు. ఉపాధి పనులతో మా గ్రామానికి మేలు జరుగుతుంది.

– భూమవ్వ, కూలీ, ధర్మోర

కుటుంబాన్ని పోషించుకుంటున్నా..



ఉపాధిహామీ పథకం కింద మా గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలో పని చేస్తున్నా. వెంటనే కూలి చెల్లిస్తున్నారు. ఈ డబ్బులతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నా. నర్సరీ ఏర్పాటు చేయకముందు ఇతర ప్రాంతాల నుంచి మొక్కలను తెచ్చుకునేవాళ్లం. ఇప్పుడా ఇబ్బంది లేదు.

– చిట్టి భోజన్న, కూలీ, హవర్గా

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధిహామీ పథకం కింద వివిధ రకాల పనులు కల్పిస్తున్నాం. చెరువుల పూడిక తీతతోపాటు పొలాలకు వెళ్లే రోడ్ల ఏర్పాటు తదితర పనులు పథకం కింద చేయిస్తున్నాం. దీంతో కూలీలకు ఉపాధి దొరుకుతుంది. అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

అడవుల్లో అగ్నిప్రమాదాలు నివారించాలి


మాట్లాడుతున్న డీఆర్‌ఓ నజీర్‌ఖాన్

సారంగపూర్: ప్రతిఒక్కరూ అడవుల్లో జరిగే అగ్నిప్రమాదాలను నివారించేందుకు సహకరించాలని సారంగాపూర్ డెప్యూటీ రేంజ్ అధికారి నజీర్‌ఖాన్ అన్నారు. మండలకేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. శీతాకాలం నుంచి వేసవి కాలం వరకు అడవిలో చెట్లు ఆకురాల్చడం, మోడువారడం జరుగుతుందన్నారు. పశువుల కాపరులు, బాటసారులు, బీడీలు, సిగరెట్లు కాల్చి వాటి ముక్కలను ఆర్పకుండా పారేస్తుండటంతో అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు వివరించారు. తునికాకు సేకరణకు అడవిలో నిప్పు పెట్టడం చట్టరీత్యా నేరమన్నారు. రైతులు చేన్లలోని వరికొయ్యలు, పత్తికర్ర కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మామడ: అడవిలో నిప్పుపెట్టడం ద్వారా చెట్లకు, వన్యప్రాణులకు ఇబ్బంది కలుగుతుందని పొన్కల్ అటవీ క్షేత్ర అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని బండలఖానాపూర్‌లో గ్రామస్తులకు అడవిలో నిప్పుపెడితే నష్టాలను వివరించారు.


కడెం: అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కడెం: మండలంలోని దోస్త్‌నగర్ గ్రామంలో అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కల్లెడ డీఆర్వో ప్రకాశ్ అవగాహన కల్పించారు. పొలాల చుట్టూ విద్యుత్ కంచెలు ఏర్పా టు చేయవద్దని, అడవిలో నిప్పు పెట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రమౌళి, ఎఫ్ఎ స్‌వో సురేందర్, ఎఫ్‌బీవోలు అరుణ్, ప్రసాద్, సుజాత, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

రైతు పండుగకు తరలిరావాలి


సారంగపూర్‌లో ఫ్లెక్సీ చూపుతున్న అబ్దుల్‌హాదీ


ఖానాపూర్‌లో సంబురాల్లో అధికారులు, రైతులు

ఖానాపూర్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది, అన్నదాతలలో కలిసి ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ సెక్రెటరీ అజాంఅలీ, పలువురు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సారంగపూర్: మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న రైతుపండుగ కార్యక్రమం విజయవంతం చేయాలని సారంగపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ అన్నారు. గురువారం రైతుసభ పోస్టర్‌ను ఏఎంసీ కార్యాలయంలో ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమానికి ప్రజలు రావాలని కోరారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ శంకర్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి ధూమ్యానాయక్ డైరెక్టర్లు ఉన్నారు.

పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి స్పందన

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ప్రజలు బీజేపీ వైపు ఉన్నారని.. పార్టీ సభ్యత్వ నమోదుకు స్పందన లభించిందని జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా సంస్థాగత ప్రాథమిక సభ్యత్వ నమోదు పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తవడంతో పరిశీలన చేసినట్లు పేర్కొన్నారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు బూత్ కమిటీల సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. త్వరలోనే మండల, జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, నాయకులు రావుల రామనాథ్, ప్రాథమిక సభ్యత్వ నమోదు కన్వీనర్ కమల్నయన్, కోకన్వీనర్ సుష్మ, జిల్లా క్రియాశీల సభ్యత్వ కోకన్వీనర్ రాచకొండ సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసిమ్మె రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి పాండే, నారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్, ముధోల్ అసెంబ్లీ కన్వీనర్ సుమన్, జుట్టు అశోక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అంజు కుమార్‌రెడ్డి

కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆదేశాల మేరకు గురువారం కాంగ్రెస్ పట్టణశాఖ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దిలావర్‌పూర్ మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులిచ్చి.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని కుట్రలు చేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, టీపీసీసీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి అజర్ హుస్సేన్, కౌనిలర్లు ఇమ్రాన్ ఉల్లాహ్, తారకరఘు, నెల్లూరి పోశెట్టి, దేవరకోట దేవస్థానం చైర్మన్ కొండ శ్రీనివాస్, మైనార్టీ పట్టణ అధ్యక్షులు మతీన్, పోశెట్టి, ఖిజర్, అర్షద్, నవీద్, సజ్జద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

‘ఖాళీలు భర్తీ చేయాలి’

భైంసాటౌన్: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్, అశోక్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కేజీబీవీని సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పట్టణంలోని కేజీబీవీలో ఇంగ్లిష్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ స్పందించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఉపాధ్యాయులకు బేసిక్ పే మంజూరుతోపాటు కేర్ టేకర్‌ను నియమించాలని కోరారు. జిల్లా కార్యదర్శులు ఎ.రమేశ్, ఫాజిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భైంసాటౌన్: పట్టణంలోని గడ్డెన్న నివాసం వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దిలావర్‌పూర్ మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేయడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీంతో సీఎం అనుమతులు రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, మురళీగౌడ్, రాథోడ్ రాంనాథ్, భూమన్న, తదితరులున్నారు.

దీక్షాపరుల పాదయాత్ర


పాదయాత్రగా వెళ్తున్న స్వాములు

బాసర: మండలకేంద్రంలోని అయ్యప్ప దీక్షాపరులు నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం వద్ద ఉన్న అయ్యప్ప ఆలయానికి గురువారం పాదయాత్రగా తరలివెళ్లారు. బాసర అయ్యప్ప సేవా సమితి కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు, గురుస్వామి కిష్టాగౌడ్, కేరళ రాష్ట్రంలోని అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీయ కార్యవర్గ సభ్యులు, శాశ్వత అన్నదాన ట్రస్ట్ సభ్యులు జంగం రమేశ్ 15 కిలోమీటర్లు నడిచి స్వామి వారిని దర్శించుకున్నారు.

బాబా ఆలయంలో సందడి

కుంటాల: రెండో షిరిడీగా పేరుగాంచిన మండలంలోని కల్లూరు సాయిబా బా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ గ్రామాల మహిళలు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

జోరుగా వరి కోతలు



లక్ష్మణచాంద: మండలంలో వరి కోతలు చివరిదశకు చేరాయి. గురువారం వడ్యాల్–రాచాపూర్ గ్రామాల మధ్య చెరువుకట్ట కింద ఒకేసారి పలు హార్వేస్టర్లు పొలాలు కోస్తూ కనిపించాయి.